

## అందని తడి.. ఎండిన మడి

సర్కారు మారితే పోచారం చివరి ఆయకట్టు రైతుల పరిస్థితిలో మార్పు వస్తుందేమోనన్న ఆశ పడిన దడిగె సంగయ్యకు నిరాశే మిగిలింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా రైతులను పట్టించుకోక పోవడంతో విస్తుపోయాడు. కనీసం సాగునీరు కూడా అందించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. యాసంగిలో ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ శివారులోని రెండెకరాల్లో వరి నాటు వేశాడు. ఎండలు ముదరకముందే పొలంలో ఉన్న బోరు వట్టిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం పోచారం ఆయకట్టుకు నీరందేలా కాలువలకు మరమ్మతులు చేయిస్తుందేమో అనుకున్నాడు. కానీ అవన్నీ వట్టిమాటలేనని తన పొలం ఎండిపోయేదాకా అర్థం కాలేదు. పెట్టుబడి పూర్తిగా రూ. 40వేలు నష్టపోయానని కంటతడి పెడుతున్నాడు. ప్రజాప్రభుత్వం, రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అన్నదాతలను గాలికి వదిలేసిందని మండిపడ్డాడు.

–ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 23

## అప్పులు గుర్తుకు వస్తున్నయ్..





నిజాంసాగర్ మండలం మంగ్లూర్ గ్రామానికి చెందిన గూల దత్తుకు ఐదెకరాల భూమి ఉంది. అందులో రెండు బోర్లు వేసుకున్నాడు. ఆరుతడి పంట జొన్న సాగు చేస్తున్నాడు. మొన్నటిదాకా ఫుల్లుగా పోసిన మోటర్లు.. ఇప్పుడు సతాయిస్తున్నాయి. మార్చి రాకముందే బోర్ల నుంచి నీళ్లు సరిగా రావడంలేదు. ఆరుతడి పంటకే నీరు సరిపోవడంలేదు. కండ్ల ముందే పంటలు ఎండిపోతుంటే అప్పులు గుర్తుకు వస్తున్నాయని దిగులు పడుతూ తెలిపాడు. ఇప్పుడే ఇలా ఉంటే.. ఎండలు ముదిరితే పరిస్థితి ఎలా ఉం టుందో? తలుచు కుంటేనే భయంగా ఉందని అంటున్నాడు.


–నిజాంసాగర్, ఫిబ్రవరి 23

# పాతాళానికి జలం
# సర్కారు నిస్తేజం

*ఎండాకాలం ప్రారంభానికి ముందే ఉమ్మడి జిల్లాలో సాగునీటి కటకట మొదలైంది. భూగర్భ జలమట్టాలు పడిపోతుండడంతోపాటు ప్రాజెక్టుల ద్వారా నీటి తరలింపులో వేగం లేక ఆందోళనకర పరిస్థితి ఏర్పడింది. దీంతో వరి సాగుచేస్తున్న రైతుల్లో ఆందోళన నెలకొన్నది.*

*–నిజామాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- వేసవి ప్రారంభానికి ముందే సాగునీటి కటకట
- రైతుల అవస్థను పట్టించుకోని పాలకులు
- ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ఆయకట్టు రైతుల్లో ఆందోళన



## కరెంటు లేక.. నీళ్లు అందక..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండుగలా సాగింది. కానీ ఇప్పుడు పరిస్థితి మళ్లీ ఉల్టా అయ్యింది. వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు సరాఫరా లేకపోవడంతో పొలాలు ఎండుతున్నాయి. మాచారెడ్డి మండలంలోని కాకులగుట్టతండా గ్రామానికి చెందిన విస్లావత్ భాస్కర్ రెండెకరాల్లో వరి వేశాడు. ఉదయం 5 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంటు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ కరెంట్ ఎప్పుడుంటదో.. ఎప్పుడు పోతదో తెలియని పరిస్థితి. దీంతో పొలమంతా పారక ఒక భాగం ఎండిపోతున్నదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఏటా తనకు 70 కింటాళ్ల దిగుబడి వచ్చేదని, ఈ యాసంగి పరిస్థితి చూస్తే 20 క్వింటాళ్ల ధాన్యం కూడా చేతికి వచ్చేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

-మాచారెడ్డి, ఫిబ్రవరి 23

### వ్యవసాయానికి పొంచి ఉన్న భారీ ముప్పు

గతంలో కేసీఆర్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో ఒక్క గుంటకూడా బీడు పెట్టకుండా రైతులంతా ధైర్యంగా పంటలు సాగు చేశారు. ఈ యాసంగిలోనూ సాగు విస్తీర్ణం భారీగానే ఉన్నప్పటికీ సాగునీటి ఎద్దడి చూస్తుంటే చివరి తడికి నీళ్లు అందుతాయా? లేదా? అన్న సందేహంతో రైతులు దిగులు చెందుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో దాదాపుగా 5లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు సాగవుతుండగా, 3.5లక్షల ఎకరాల్లో వరి పండిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోనూ సాధారణ సాగు విస్తీర్ణం లక్షా 90వేల ఎకరాలు కాగా, రెట్టింపు స్థాయిలో వరి సాగైంది.

### పడిపోతున్న భూగర్భ జలమట్టం..

నిజామాబాద్ జిల్లాలోని 33 మండలాల్లో 81 ఫిజో మీటర్లు ఉన్నాయి. 10 మీటర్ల కన్నా తక్కువ లోతులో నీరున్న ప్రాంతాలను 49గా గుర్తించారు. 10 నుంచి 15 మీటర్ల మధ్యలో 17 ప్రాంతాలు, 15– 20 మీటర్ల మధ్యలో 11 ప్రాంతాలు, 20 మీటర్ల కన్నా ఎక్కువ లోతులో నీరున్నవి 4 ప్రాంతాలున్నట్లుగా తేల్చారు. భీంగల్ మండలంలో పరిస్థితి దారుణంగా ఉంది. గోన్‌గొప్పులలో నీటి మట్టం 26.83 మీటర్ల లోతుకు చేరింది. గతేడాది ఇదే సమయానికి 21.12 మీటర్లు ఉండగా ఈసారి మరింతగా తగ్గింది. 2023 ప్రారంభంలో జిల్లా సగటు నీటిమట్టం 8.91 మీటర్లుగా ఉన్నది. ప్రస్తుతం 10.06 మీటర్లకు చేరి రెండు మీటర్ల మేర భూగర్భ జలాలు పడిపోయాయి. నిజామాబాద్ నార్త్ మండలంలోని కంఠేశ్వర్ ఏరియాలో గతేడాది 18.97 మీటర్లు ఉండగా, ఇప్పుడు 21మీటర్లకు చేరింది. సిరికొండ మండలంలోని ముషీర్‌నగర్‌లో గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 21.22 మీటర్లకు పడిపోయింది. చలికాలం ముగియక ముందే భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతన్నలను భయం వెంటాడుతున్నది. ఇప్పుడే ఇట్లుంటే పొలాలకు నీళ్లు పారించేదెట్లా? పంట చేతికొచ్చేదెట్లా.. అనే ఆందోళనలో ఉన్నారు.

### ఎస్సారెస్పీ ఆయకట్టుకు అంతే..

తలాపున శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ బాల్కొండ నియోజకవర్గంలోని ఆయకట్టు రైతులకు సాగు నీరు అందని దీనావస్థ నెలకొన్నది. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 35.039 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. సరాసరి ఔట్ ఫ్లో 6వేల క్యూసెక్కులు కొనసాగుతున్నది. కాకతీయ కెనాల్ ద్వారా నెలన్నర రోజులుగా ఎస్సారెస్పీ జలాలను తరలిస్తుడడంతో బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని రైతన్నల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తున్నారు. భవిష్యత్తు అంచనాల ప్రకారం నీటిని విడుదల చేయాలని సూచిస్తున్నప్పటికీ ప్రభుత్వం అనాలోచితంగా వ్యవహరిస్తుండడంతో రైతన్నలకు ఇక్కట్లు తప్పేలా లేవు. ఎస్సారెస్పీ జలాలతోనే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో లక్షలాది నల్లాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని చేరవేస్తున్నారు. సాగునీటిని ప్రణాళిక లేకుండా వదిలితే వేసవిలో తాగునీటికి కూడా తిప్పలు ఎదురయ్యే ప్రమాదముంది.

### పట్టించుకోని పాలకవర్గం..

ఉభయ జిల్లాల్లో సాగు పరిస్థితులు ఈ విధంగా ఉంటే పాలకవర్గం మాత్రం పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా రైతుల ఊసెత్తడంలేదు. యాసంగిలో పెట్టుబడి సాయం కూడా అరకొరగానే అందింది. డబ్బుల్లేక చాలామంది రైతులు అవస్థలు ఎదుర్కొన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతోనే పంటల సాగులో అడుగు పెట్టిన రైతులకు ఇప్పుడు సాగునీటి కటకట ఎదురవుతుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. భారీగా దిగుబడులు వస్తాయని ఆశతో ఉన్న వారికి సాగు నీరు ఊపిరి పోస్తుందా.. ఉసూరు మనిపిస్తుందా.. అన్నది ప్రశ్నార్థకంగా మారింది.



## కనుల పండువగా రథోత్సవం

### సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 23: ఖిల్లా డిచ్‌పల్లి సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు సుమిత్ శర్మ దేశ్‌పాండే నేతృత్వంలో ఉదయం హోమం, బలిహరణం, సాయంత్రం హోమం, బలిహరణం, రథప్రతిష్ఠ, రథహోమం, రథబలిహరణం కార్యక్రమాలు నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై యజ్ఞంలో పాల్గొన్నారు. గ్రామపెద్దలు, భక్తులు, ఆలయకమిటీ సభ్యులు సీతారామచంద్రస్వామి గోవిందా, గోవిందా అంటూ నినాదాలు చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి, కొబ్బరికాయలు కొట్టారు. అర్ధరాత్రి వరకు గ్రామంలోని ప్రధానవీధుల గుండా సీతారాముల రథయాత్ర కొనసాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఖిల్లా రామాలయ చైర్మన్ జంగం శాంతయ్య, సభ్యులు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూరమాధురి, ఆసది జితేందర్, తాజా మాజీ సర్పంచ్ గడ్డం రాధాకృష్ణారెడ్డి, బూస సుదర్శన్, ఏజీ దాసు, విండో మాజీ చైర్మన్ గజవాడ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బోధన్‌కు కేబినెట్ సబ్ కమిటీ రాక

బోధన్, ఫిబ్రవరి 23: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీకి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ శనివారం ఉదయం రానున్నది. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, పలువురు ఉన్నతాధికారులు ఉదయం 11 గంటలకు నిజాంషుగర్స్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా చెరుకు రైతులు, కార్మికులతో సమావేశం కానున్నారు. వారం రోజుల కిందటే ఈ కమిటీ నిజాంషుగర్ ఫ్యాక్టరీకి రావాల్సి ఉండగా, అనివార్య కారణాలతో ఆ పర్యటన వాయిదాపడిన విషయం తెలిసిందే.

## కామారెడ్డి అదనపు కలెక్టర్ బదిలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 23: కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా విధులు నిర్వహిస్తున్న మను చౌదరి బదిలీ అయ్యారు. ఉద్యోగోన్నతిపై సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా నియామకం అయ్యారు. కామారెడ్డి అదనపు కలెక్టర్ ఆయన సుమారు ఆరు నెలలపాటు విధులు నిర్వర్తించారు. కాగా ఆయన స్థానంలో ప్రభుత్వం ఎంకా ఎవరినీ నియమించలేదు.

## జిల్లా జైలును సందర్శించిన డీజీ

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 23: నిజామాబాద్ కేంద్ర కారాగారాన్ని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా, ఐజీ ఎన్.మురళీబాబు, వరంగల్ డీఐజీ ఎం.సంపత్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా బ్లాక్‌లో ఉన్న ముద్దాయిలతో మాట్లాడి వారి విజ్ఞప్తులు స్వీకరించారు. జైలులోని అన్ని విభాగాలు, దవాఖాన బ్లాక్‌ను పరిశీలించారు. ప్రింటింగ్, ప్రెస్ యూనిట్, స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి అందులో ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారుల వెంట జైలు సూపరింటెండెంట్ ఇతర సిబ్బంది ఉన్నారు.

## ఎమ్మెల్యే నందిత మృతికి పోచారం సంతాపం

*బాన్సువాడ, ఫిబ్రవరి 23: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి చెందడంపై మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఎంతో రాజకీయ భవిష్యత్తు ఉన్న లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడం తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.*



## నివాళి

*రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందితకి నివాళులర్పించారు. కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపారు.*

*– కోటగిరి, ఫిబ్రవరి 23*

## కందకుర్తి విశిష్టతను ప్రధాని దృష్టికి తీసుకువెళ్తా..

రెంజల్, ఫిబ్రవరి 23: కందకుర్తిలో సాధు సంతులు తపస్సు చేసిన పవిత్రమైన స్థలం, మూడు నదులు కలిసే త్రివేణి సంగమ విశిష్టతను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తానని నాందేడ్ రాజసభ సభ్యుడు డాక్టర్ అజిత్ గోప్‌చడే అన్నారు. కందకుర్తి గ్రామంలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గేవార్ జన్మస్థలాన్ని శుక్రవారం రాజసభ సభ్యుడు అజిత్‌గోప్‌చడే, ఆయన సతీమణి చేతనతో కలిసి సందర్శించి పూజలు నిర్వహించారు. సీతారాం సంత్ ఆశ్రమంలో ఆయన మాట్లాడుతూ... హెడ్గేవార్ జన్మ స్థలాన్ని దర్శించుకున్నాకే రాజకీయ కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన వెంట సీతారాం త్యాగి మహరాజ్, కేశవ సేవాసమితి సభ్యులు అంకు మహేశ్, హన్మంతురావు తదితరులు ఉన్నారు.



స్మృతివనం నమూనాను చూపుతున్న రాజ్యసభ సభ్యుడు అజిత్

# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### సెక్టోరల్ అధికారుల పాత్ర క్రియాశీలకం
### కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 23: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒకరిద్దరు మినహాయిస్తే సెక్టోరల్ అధికారులందరూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించారన్నారు. అదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని హితవు పలికారు. విధులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని, ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విధుల పట్ల అలసత్వాన్ని ప్రదర్శిస్తూ నిర్లక్ష్యానికి తావిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా నగదు, మద్యం, మత్తు పదార్థాలు, ఇతర సామగ్రిని పంపిణీ చేసే అవకాశాలు ఉన్నందున కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేపడుతామన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల వద్ద సాయుధ బలగాలను మోహరిస్తామన్నారు. జిల్లా ఉప ఎన్నికల అధికారిణి కృష్ణవేణి, ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్, ఏఆర్ఈవోలు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

# ఆదాయ వనరులకు మార్గాలు అన్వేషించాలి

### కలెక్టర్ జితేశ్ వీ పాటిల్
### కామారెడ్డి బల్దియా బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, చిత్రంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, అదనపు కలెక్టర్ మనుచౌదరి, కమిషనర్ సుజాత

కామారెడ్డి, ఫిబ్రవరి 23: కామారెడ్డి పట్టణం రోజురోజుకూ విస్తరిస్తున్నందున ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై పాలకవర్గ సభ్యులు దృష్టి సారించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. స్థానిక కళాభారతిలో మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి అదనపు కలెక్టర్ మనుచౌదరి, మున్సిపల్ కమిషనర్ సుజాతతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరానికి రూ.4228.11 లక్షల అంచనా బడ్జెట్ 2023–24 సంవత్సరానికి సవరించి రూ.3666.4 లక్షల బడ్జెట్‌కు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. పన్నుల రూపేణా రూ.1295.90 లక్షలు, అద్దెలు, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ మార్గాల ద్వారా రూ.1368.21లక్షలు, డిపాజిట్లు, లోన్స్ ద్వారా రూ.22లక్షలు, క్యాపిటల్ ప్రాజెక్ట్ ఫండ్స్ ద్వారా రూ.142 లక్షలు వస్తాయని అంచనా వేశారు. ఇందులో జీతాలు, శానిటేషన్, విద్యుత్ బిల్లులకు రూ.216 లక్షలు, గ్రీన్ బడ్జెట్ కింద రూ.296 లక్షలు ఖర్చు చేయాలని నిర్దేశించారు. ఇంజినీరింగ్,టౌన్ ప్లానింగ్,సాధారణ పరిపాలన ఖర్చులు రూ.138లక్షలు, వార్డుల వారీగా చేపట్టిన పనులు, ప్రజా ఉపయోగ పనులకు రూ.22.33 లక్షలు, డిపాజిట్లు, లోన్ల కింద రూ.22 లక్షలు, నాన్ ప్లాన్ గ్రాంట్ కింద రూ.1542 లక్షలు ఖర్చు చేసేందుకు రూపొందించిన ప్రణాళికలకు సభ ఆమోదం తెలుపుతూ తీర్మానించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, తాగునీరు వృథా కాకుండా ప్రతి ఒక్కరూ కుళాయిలు పెట్టుకునేలా చూడాలని కోరారు. వైకుంఠధామాలు వాడుకలో వచ్చేలా చూస్తామని సభ్యులను అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

## హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

కామారెడ్డి, ఫిబ్రవరి 23: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(బేగంపేట్)లో 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన షెడ్యూల్డ్ కులాల బాల, బాలికలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో ఈ నెల 24 నుంచి మార్చి 12న సాయంత్రం 5 గంటల వరకు అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేవారు 2017 జూన్ 1 నుంచి 2018 మే 31 మధ్యన జన్మించి ఉండాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం అర్బన్ ఏరియాలో రూ. 2 లక్షలు, రూరల్‌లో రూ.1.50 లక్షలు మించి ఉండరాదని పేర్కొన్నారు. మార్చి 15న జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు.